www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 8 డిసెంబర్ 2025
5
డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ



నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో జరుగుతున్న పిజిఆర్ఎస్ కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం పది గంటల నుంచి నిర్వహించే పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తామని చెప్పారు. స్థానిక కలెక్టరేట్, డివిజన్, పురపాలక సంఘాలు, మండల కేంద్రాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారించాలని ఆదేశించారు. అర్జీదారులు తమ అర్జీలను Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లోనూ నమోదు చేసుకోవచ్చని, నమోదైన అర్జీల స్థితి, సంబంధిత సమాచారం తెలుసుకునేందుకు 1100కి నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చునని ఆయన తెలిపారు.

దిగజారిన కొబ్బరి ధర

-వెయ్యి కాయలపై రూ.11 వేలు తగ్గుదల
-తగ్గిన ఎగుమతులు
-ఢీలా పడుతున్న వ్యాపారులు



ప్రజాశక్తి - రాజోలు

జిల్లాలో కొబ్బరికాయల ధరలు పడిపోయాయి. ప్రాంతీయ మార్కెట్లో బాగా దిగజారాయి. వెయ్యింటికి రూ.10 వేల నుంచి రూ.11 వేల మేర పతనమైనట్లు రైతులు, వర్తకులు చెబుతున్నారు. కార్తిక మాసం ప్రారంభానికి ముందు వెయ్యి పచ్చికాయలు రూ. 23-25 వేల మధ్య ఉంది. ప్రస్తుతం రూ.14-15 వేల వరకు దిగజారాయి. తమిళనాడులో కొబ్బరి ఉత్పత్తి ఆశాజనకంగా ఉండటం ప్రస్తుత పరిస్థితికి కారణంగా భావిస్తున్నారు. శీతాకాలం ప్రారంభమైన తరుణంలో ఉత్తరాది రాష్ట్రాల్లో పండగల సమయం ముగియడంతో కాయల వినియోగం తగ్గింది. ఆయా రాష్ట్రాలకు ఎగుమతులు పెద్దగా లేకపోవడంతో ధరలు క్షీణించినట్లు వర్తకులు అంటున్నారు. బీహార్, ఉత్తరప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సైతం కొబ్బరికాయల ఎగుమతులు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ కారణాల వల్ల ధరలు తగ్గినట్టు వ్యాపారులు చెబుతున్నారు.

జిల్లాలో రైతు వారీ వెయ్యి కాయల ధర గరిష్ఠంగా రూ.26 వేలు ఉండగా ప్రస్తుతం రూ.15 వేలకు పడిపోయింది. ప్రస్తుత కొబ్బరి దిగుబడులు ఎక్కువగా ఉన్నప్పటికీ ధర తగ్గుదలతో రైతులు అసంతృప్తిగా ఉన్నారు. గడచిన మూడు, నాలుగేళ్లలో కొబ్బరి ధరలు ఈ స్థాయికి పడిపోలేదు. దీంతో రైతులు కొబ్బరిసాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టేందుకు రైతాంగం అంతగా ఆసక్తి కనబరచడం లేదు. కొబ్బరి చెట్లకు సకాలంలో సేంద్రియ, రసాయన ఎరువులు వేయకపోవడం, దుక్కి, నీటి తడులు ఎక్కువసార్లు పెట్టకపోవడంతో పాటూ, కొబ్బరిచెట్లకు తెగులు సోకి ఆకులు నల్లగా మారిపోవడం వంటి వాటితో కొబ్బరి కాయ పరిమాణం తగ్గింది. ప్రతి వంద కాయలలో 20 నుంచి 30 చిన్నకాయలు వస్తున్నాయి. దీంతో ఈ కాయలను వర్తకులు రెండింటిని ఒకటిగా లెక్కిస్తున్నారు. ఈవిధంగా రైతులు నష్టపోతున్నారు. మరోవైపు దిగుబడి గణనీయంగా తగ్గిపోయింది. అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే కొబ్బరి రైతులు సంతృప్తిగానే ఉన్నారు. ప్రస్తుతం కొబ్బరి ధరలు గరిష్ఠస్థాయికి చేరడం తోపాటు, భవిష్యత్‌లో మార్కెట్ నిలకడగా ఉంటుందని అంచనా ఉండటంతో కొబ్బరి రైతులు కొబ్బరి సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. పక్వానికి వచ్చిన కాయలే దింపాలని, వచ్చే ఒకటి, రెండు నెలల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున.. అప్పటికి పక్వానికి వచ్చిన కాయలు ఉంటే రైతులకు లాభం చేకూరుతుందని విశ్లేషకులు చెబుతున్నారు. పాత తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి కొబ్బరి ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి.

తగ్గిన ఎగుమతులు...!

తమిళనాడు, కేరళలో కొబ్బరి దిగుబడి పెరగడంతో ఇక్కడి కొబ్బరికి డిమాండ్ తగ్గింది. అంతేకాక ఉత్తరాద్రి రాష్ట్రాల్లో కొబ్బరి పరిశ్రమలు వినియోగించే ఎండు కొబ్బరి ఇండోనేషియా, థాయ్‌లాండ్ తదితర దేశాల నుంచి దిగుమతి పెరిగిన కారణంగా ఉభయ గోదావరి జిల్లాల కొబ్బరికి డిమాండ్ తగ్గిందని పరిశీలకులు చెబుతున్నారు. ఉభయ గోదావరి జిల్లాల నుంచి రాయలసీమ ప్రాంతానికి, తెలంగాణలో పలు ప్రాంతాలతో పాటు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, ఇంకా పలు ఉత్తరాది రాష్ట్రాలకు కొబ్బరికాయలు ఎగుమతులు అవుతున్నాయి. ఏటా జూలై, ఆగస్టు నెల ప్రథమార్ధంలో బీహార్ రాష్ట్రానికి కొబ్బరి ఎగుమతులు అవుతాయి. 15 రోజులుగా బీహార్ రాష్ట్రానికి ఎగుమతులు మొదలయ్యాయి. ఒలిచిన కొబ్బరికాయలను ఉత్తరాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. బీహార్ రాష్ట్రానికి మాత్రం కొబ్బరి చెట్ల నుంచి దించిన కాయలను నేరుగా ఎగుమతి చేస్తారు. ముఖ్యంగా కోనసీమ, పాలకొల్లు ప్రాంతాల నుంచి ప్రతీరోజూ సుమారు 80 నుంచి 100 లారీలు కొబ్బరికాయ ఎగుమతి అవుతుండేవి. ప్రస్తుతం ఈ ప్రాంతాల నుంచి సుమారు 40 నుంచి 50 పైబడి లారీల కొబ్బరి ఎగుమతులు అవుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న 104 ఉద్యోగులు

సమస్యల పరిష్కారం కోసం ధర్నా

ప్రజాశక్తి - అమలాపురం

104 వాహనాల్లో విధులు నిర్వహిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిబ్బంది ధర్నా చేశారు. ఆదివారం కలెక్టరేట్ వద్ద జరిగిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 104 ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షులు నూకల బలరాం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందిస్తున్న ప్రజా సంజీవనిగా 104 సిబ్బంది గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు. అయితే అందులో పని చేస్తున్న సిబ్బంది మాత్రం సమస్యలతో సతమతమౌతున్నారని తెలిపారు. చాలి చాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. అరబిందో నుంచి రావాల్సిన బకాయిల విషయంలో సిబ్బంది తీవ్ర అన్యాయానికి గురౌతున్నారని అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అరబిందో నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని కోరారు. ప్రస్తుత యాజమాన్యం ఇప్పటివరకు నియామక పత్రాలు కానీ, పే స్లిప్స్ కానీ సిబ్బందికి ఇవ్వలేదని, ప్రభుత్వం వెంటనే అధికారులు, యాజమాన్యం యూనియన్ ప్రతినిధులతో జాయింట్ మీటింగ్ నిర్వహించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎటువంటి అనుభవం లేని డేటా ఎంట్రీ ఆపరేటర్‌కి మండల నిర్వహణ బాధ్యత నుంచి తొలగించాలని, జీతంలో వ్యత్యాసాన్ని సవరించి ఇప్పటివరకు కోత విధించిన డబ్బులు ఎరియర్ రూపంలో ఇప్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఇచ్చిన షోకాజ్ నోటీసు మీద పునరాలోచన చేయాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.18500 ఇవ్వాలని, 5 సంవత్సరాల సర్వీస్ పూర్తి అయిన డ్రైవర్‌లకు ఆటోమెటిక్‌గా స్లాబ్ అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో 104 సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచారాలను అరికట్టడంలో విఫలం

ప్రజాశక్తి - అమలాపురం

బాలికలు, మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టడంలో పాలకులు, అధికారులు విఫలం అవుతున్నారని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు దైవకృప అన్నారు. ఆదివారం స్థానిక ఎంప్లాయిస్ హోమ్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆమె అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లాలో మైనర్ బాలికలపై అత్యాచారాలు రోజురోజుకి పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మైనర్ బాలికలపై అత్యాచారాలు అరికట్టడంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారని మండిపడ్డారు. ఒక చోట జరిగినప్పుడు మరో చోట జరగకుండా భద్రత చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. అవగాహన సదస్సులు ద్వారా మైనర్ బాలికల్లో చైతన్యం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు డి.ఆదిలక్ష్మి, సుశీల, అమూల్య, హైమావతి, సిహెచ్.నాగవేణి, విజయలక్ష్మి, గౌరీదేవి, ఈశ్వరి పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఐద్వా నాయకులు, మహిళలు

13న మాలల ఆత్మీయ సభ

ప్రజాశక్తి - రామచంద్రపురం

పార్టీలకు అతీతంగా ఈనెల 13న అమలాపురంలో మాలల ఆత్మీయ సభను నిర్వహిస్తున్నట్లు దళిత నాయకులు ఇసుకపట్ల రఘుబాబు తెలిపారు. ఆదివారం ద్రాక్షారామ ఎఎంసిలో నియోజకవర్గ మాల నాయకులతో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల ఐక్యతను రాష్ట్రమంతా సాటి చెప్పేందుకు ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్నారు. మాలలకు జరుగుతున్న అన్యాయాలను ఎదుర్కొనేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా మాలలు అంతా ఈ సమ్మేళన తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవిష్యత్తులో ఎదుర్కొనే సమస్యలు, సవాళ్లను చర్చించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో కన్వీనర్ జంగా బాబురావు, రవ్వ భూషణం, జై భీమ్ దళిత సంఘం నాయకులు గుబ్బల శ్రీనివాస్, సర్పంచ్ అంబటి తుకారం, వెంటపల్లి రామకృష్ణ, అబ్బాస్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - రావులపాలెం

కష్టకాలంలో ఉన్న ప్రజలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి బాధితులకు విడుదలైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతికి సిఎం చంద్రబాబునాయుడు, డిసిఎం పవన్ కల్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా నియోజకవర్గంలో వైద్యం నిమిత్తం దరఖాస్తు చేసిన ప్రతి అర్హుడికి సిఎంఆర్ఎఫ్ నుంచి సాయం అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు విడుదలైన రూ.17,92,681 విలువైన చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.


చెక్కును అందిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

విద్యాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - అయినవిల్లి

ప్రభుత్వ విద్యారంగం పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు విద్యాభివృద్ధికి విఘాతం కలిగిస్తున్నాయని మాజీ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు(ఐవి) విమర్శించారు. ఆదివారం మండలంలోని ముక్తేశ్వరం బిఇడి కళాశాలలో యుటిఎఫ్ మండల కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరీక్షల విధానాన్ని సంస్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనేక పథకాలను ప్రవేశపెట్టి ఉపాధ్యాయులను మానసిక హింసకు గురి చేస్తున్నారని అన్నారు. అటువంటి తప్పుడు విధానాలను ఉపాధ్యాయులు సంఘటితంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు పెంకే వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మండల యుటిఎఫ్ శాఖ గౌరవ అధ్యక్షులుగా గుబ్బల సాయిశ్రీనివాస్, అధ్యక్షులుగా టిబి.ఈశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షులుగా ఎంఎన్ఎస్.కిరణ్‌బాబు, మహిళా అసోసియేట్ అధ్యక్షులుగా కుడిపూడి నాగలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా బీర సందీప్, ఆర్థిక కార్యదర్శిగా ఎం.కిరణ్‌తేజ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాకర శ్రీనివాసరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు బి.శ్రీనివాసరావు, పి.మురుగేశ్వర రావు, సిహెచ్. కేశవరావు, వై.మురళీ, తదితరులు పాల్గొన్నారు.


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌సి ఐవి

డాక్టర్ రవికుమార్‌కు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి - రాజోలు

మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన ఫిజియోథెరఫిస్ట్ డాక్టర్ సొడదాసు రవికుమార్‌కు ఉత్తమ ఫిజియోథెరఫిస్ట్ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమలాపురంలోని కిమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్‌పిఎఆర్‌సిసి (సదరన్ ఫిజియో వార్షిక పరిశోధన మరియు సాంస్కృతిక సమావేశం)లో ఉత్తమ వైద్యుడిగా తనను గుర్తించి అవార్డు ఇవ్వడం మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. గత 15 ఎళ్లుగా రాజోలులో రవి ఫిజియోథెరఫి సెంటర్ ద్వారా వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రవికుమార్

రికవరీ ఆసుపత్రిని సందర్శించిన ఎంఎల్ఎ

ప్రజాశక్తి - రావులపాలెం

ఇటీవల అధునాతన టెక్నాలజీతో రావులపాడులో ప్రారంభించిన రికవరీ ఆసుపత్రిని ఎంఎల్ఎ బండారు సత్యానందరావు ఆదివారం సందర్శించారు. ఆసుపత్రి ఎండి, వైద్యులు డాక్టర్ ఎం.గంగిరెడ్డిని ఆసుపత్రిలో అందించే వైద్య సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, నాయకులు కంఠంశెట్టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎంఎల్ఎ బండారు

ప్రతీ గ్రామానికి బుద్ధుని సందేశం

ప్రజాశక్తి - ఐ.పోలవరం

బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా జిల్లా శాఖ ఆధ్వర్యంలో గ్రామ గ్రామానికి బుద్ధుని సందేశాన్ని తీసుకెళ్లేందుకు చేపట్టిన భారతీయ వారసత్వ బౌద్ధ దమ్మ సాంస్కృతిక ప్రచార రథయాత్ర ఆదివారం మండలానికి చేరుకుంది. ఈ ఏడాది అక్టోబర్ 26న అమలాపురంలోని త్రిరత్న బుద్ధ విహార ప్రాంగణం నుంచి ఐయినవిల్లి, కొత్తపేట, ముమ్మిడివరం మండలాలు మీదుగా రథయాత్ర సాగింది. ఆదివారం మండంలోని మురమళ్ళ, కొమరగిరి, పాత ఇంజరం, ఎదుర్లంక, గుత్తెనదీవి, జి.వేమవరం, జి.మూలపొలం మీదుగా ఆదుర్రు వరకూ రథయాత్ర కొనసాగింది. ఈ కార్యక్రమంలో కాశి వీరవెంకటసత్యనారాయణ, బుడితి బాబూ రాజేంద్ర ప్రసాద్, గిడ్ల రమేష్, మట్టా వెంకట్రావు ఆయా గ్రామాల్లో మాట్లాడారు. ప్రతి వ్యక్తి సమాజంలో సమానత్వాన్ని గౌరవాన్ని, సుఖ సంతోషాల్ని పొందాలంటే బౌద్ధ మార్గం ఒక్కటే శరణ్యం అని అన్నారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి సురేష్, కుంచే చినబాబు, బొంతు శ్రీరాములు, వరసాల లక్ష్మినారాయణ, రేవు శ్రీను, మట్టా గగనవీరుడు, ములపర్తి శ్రీనుబాబు, బీర సత్యనారాయణ, వడ్డి గౌతమ్ పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాసకులు

కాలువ పరిశుభ్రతకు చర్యలు

ప్రజాశక్తి - ఆలమూరు


ఆలమూరు నుంచి వెదురుమూడి వెళ్లే పంట కాలువ పరిశుభ్రతకు చింతలూరు నీటి సంఘం అధ్యక్షులు గారపాటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం చర్యలు చేపట్టారు. తన సొంత నిధులతో భారీ ప్రొక్లైన్‌తో పంట కాలువలోని గుర్రపు డెక్క, తూడు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల ఆర్‌డిఒ పి.శ్రీకర్ రబీ సాగుకు పంట కాలువలు పరిశుభ్రత కోసం సమీక్ష నిర్వహించారని, ఇందులో రైతులకు సాగునీరుకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాది కాలంలో కాలువల పరిశుభ్రతకు సంబంధించి నిధులు ఇంతవరకు విడుదల కాలేదని, సొంత నిధులు ఖర్చు చేయడం కష్టంగా ఉందని ఆర్‌డిఒకు వివరించినట్లు తెలిపారు. దీనిపై ఆర్‌డిఒ సానుకూలంగా స్పందించి కలెక్టర్ దష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి పాత బకాయిలతో పాటు కొత్త నిధులు విడుదలకు కబురుషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. స్థానిక ప్రజలు గృహ ఉపకారణ ద్వారా వచ్చే చెత్తను పంట కాలవలో వేయకుండా ప్రత్యేక చర్యలు తీసుకుని డస్ట్ బిన్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.


పనులను పర్యవేక్షిస్తున్న గారపాటి శ్రీనివాసులు, రైతులు

మళ్లీ అధికారంలోకి వస్తాం : ఆదిత్య

ప్రజాశక్తి - మామిడికుదురు

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తిరిగి వైసిపిని అధికారంలోకి తీసుకొస్తామని వైసిపి రాష్ట్ర కార్యదర్శి ఆదిత్య అన్నారు. ఆదివారం మామిడికుదురులో వైసిపి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆదిత్యను నాయకులు, కార్యకర్తలు శాలువాలు కప్పి, జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి, మాజీమంత్రి గొల్లపల్లి సూర్యారావు, ఆదేశాలతో అన్ని వర్గాల ప్రజలను సమీకరించి, పార్టీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తులా గోపాలకృష్ణ, బొరుసు నరసింహమూర్తి, ఏడిద లక్ష్మణరావు, తాడి రామ్మూర్తి, షేక్ పీర్ సాహెబ్, కొమ్ముల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



శిథిలావస్థలో సిద్ధార్థ ఐటిఐ

-కనీస వసతులు కరువు - ఇరుకు గదుల్లోనే తరగతులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణంలోని సిద్ధార్థ పారిశ్రామిక శిక్షణా కేంద్రం(ఐటిఐ) శిథిలావస్థకు చేరుకుంది. 1990లో ప్రారంభించిన ఈ ఐటిఐ సుమారు 35 సంవత్సరాలుగా పని చేస్తుంది. అయితే అప్పటినుంచి ఇప్పటివరకు విద్యార్థులకు కనీస వసతులు కల్పించక పోవడం గమనార్హం. ఇరుకు గదుల్లో కనీసం లైట్లు, ఫ్యాన్‌లు సక్రమంగా లేకుండా విద్యాబోధన కొనసాగుతోంది. ఎలక్ట్రిషన్, ఫిట్టర్ ట్రేడ్ల నడుస్తున్న ఈ ఐటిఐలో సుమారు రెండు వందల మంది వరకు విద్యార్థులు ఉన్నారు. విద్యార్థులకు టాయిలెట్లు లేకపోవ డంతో ఆరు బయటకు వెళ్ళవలసి వస్తుంది. ఒక మూలన పాతబడిన ఒక టాయిలెట్ ఉన్నప్పటికీ అది సక్రమంగా లేకపోవడంతో విద్యార్థులకు టాయిలెట్లకు వెళ్లాలన్న ఇబ్బందులు తప్పడం లేదు. 35 ఏళ్లుగా విద్యార్థుల వద్ద నుంచి ఫీజులు వసూలు చేస్తున్న ఈ ఐటిఐ యాజమాన్యం భవనాలు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా మారింది. విద్యార్థులకు కనీస వసతులు కల్పించాలని, ఆధునిక భవనాలు, ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని, టాయిలెట్లు నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు. దీనిపై కరస్పాండెంట్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.


శిథిలావస్థలో ఐటిఐ తరగతుల భవనం



నగరం దీవి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వరాహాలు, ఇతరులు

చరిత్రను భావితరాలు స్వాగతించాలి


ప్రజాశక్తి - మామిడికుదురు

చరిత్రను భావితరాలు స్వాగతించాల్సిన అవసరం ఉందని ప్రముఖ వైద్యులు బసవ వరాహాలు అన్నారు. ఆదివారం స్థానిక బోయి భీమన్న మానవ వనరుల ప్రాంగణంలో సహృదయ సాహితి సకల కళావేదిక ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత బజరంగ్ లాల్‌బియానీ రచించిన 'నగరం దీవి' ద్వితీయ భాగం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కళావేదిక అధ్యక్షుడు పెదమల్లు నాగబాబు అధ్యక్షతన జరిగిన ఈ సభలో నగరం దీవికి సంబంధించి దశాబ్దాల క్రితం సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేస్తూ ఈ పుస్తకాన్ని ముద్రించారని అన్నారు. ఈ సందర్భంగా రచయితను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక కళాకారిణి దిబాష్యం కల్యాణి, కెవివి.సూర్యనారాయణ, ఏడిద కవీంద్ర, దార్ల పాపయ్యచారి, రిటైర్డ్ హెచ్‌ఎంలు బావరాజు సూర్యప్రకాశరావు, మైలవరపు రవీంద్రనాథ్, అడబాల తాతకాపు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి సూర్యప్రకాష్ పరామర్శ

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని హసన్‌బాద సర్పంచ్, ద్రాక్షారామ నాటక కళాపరిషత్ అధ్యక్షుడు నాగిరెడ్డి సతీష్‌రావు తల్లి శనివారం మృతి చెందారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పిల్లి సూర్యప్రకాష్ సర్పంచ్ కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. ఆయన తల్లి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఆయన వెంట పలువురు వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సూర్యప్రకాష్, ఇతరులు

'పోలిశెట్టి'కి ఘన సన్మానం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

వైవిఎస్, బిఆర్ఎం పాలిటెక్నిక్ కళాశాల పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న పోలిశెట్టి నరసింహచంద్రకుమార్‌ను ఘనంగా సన్మానించారు. ఆదివారం ముక్తేశ్వరంలో జరిగిన ఎస్‌టియు 79వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో పాలగుమ్మిలోని జడ్‌పి ఉన్నత పాఠశాలలో పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తూ ఇటీవల స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా జిల్లా అవార్డు అందుకున్నందుకు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు పోతంశెట్టి దొరబాబు, పల్లంరాజు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వాహనదారులకు జరిమానాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

రాయవరం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో పలువురికి జరిమానాలు విధించినట్లు ఎస్ఐ సురేష్‌బాబు తెలిపారు. వాహన తనిఖీల్లో సరైన పత్రాలు లేని 17 మందికి జరిమానాలు విధించి రూ.3,145 వసూలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు మోటార్ సైకిల్ ఇవ్వడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆలమూరు

కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని నర్సిపూడికి చెందిన వాసిరెడ్డి వెంకటసూర్యనారాయణ(55) వ్యవసాయం చేసు కుంటూ కుటుంబంతో జీవిస్తున్నాడు. ఈ క్రమంలో తన కుటుంబ అవసరాల నిమిత్తం బ్యాంకు నుంచి కొంత అప్పు తీసుకున్నాడు. ఆ అప్పు భారంగా మారడంతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు వెంటనే మండపేట ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. ఆసుపత్రిలో అతని ఆరోగ్యం విషమించి మృతి చెందినట్లు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నరేష్ తెలిపారు.



సంతకాలు సేకరిస్తున్న వైసిపి నాయకులు

కడియంలో 'కోటి సంతకాల సేకరణ'

ప్రజాశక్తి-కడియం

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కడియం గ్రామంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో పలు వీధుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఇంటింటికీ వెళ్లి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో వంగపండు ప్రసాద్, గుత్తుల రమేష్, దొడ్డా బుజ్జి, పున్నమి రాజు వీర్రాజు, పూడి వీరబ్రహ్మం, చిలుకూరు రామకష్ణ, తోరాటి గోపి, దామిశెట్టి అశోక్, కడియం గణేష్, తోట సురేష్, శాకా సతీష్, బత్తిన శ్రీధర్, వేములూరి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల హైస్కూల్లో 'స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర'

ప్రజాశక్తి-నల్లజర్ల

నల్లజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. చేతులు శుభ్రం చేసుకునే విధానాన్ని ప్రత్యక్షంగా చేసి చూపించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఒ, డిప్యూటీ ఎంపిడిఒ సింహాద్రి రావు, ఎంఇఒ వై.సత్యనారాయణ హజరయ్యారు. విద్యార్థులతో స్వచ్ఛ్ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర ప్రతిజ్ఞను చేయించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కోమల చిత్ర, పంచాయతీ కార్య నిర్వహణ అధికారి కిషోర్, అంగన్‌వాడీలు, హెల్త్ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన వద్దు

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

స్క్రబ్ టైఫస్‌పై ఆందోళన చెందాల్సిన పనిలేదని ఉండ్రాజవరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ దుర్గామహేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. తీవ్రమైన జ్వరం, వణుకు, తీవ్రమైన తలనొప్పి, కండరాల నొప్పులతో పాటు, కీటకం కుట్టిన చోట చర్మంపై దద్దుర్లు, నల్ల మచ్చలు వంటివి కనిపిస్తాయన్నారు. తీవ్రమైన దగ్గు, వికారం, వాంతి వచ్చినట్లు ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. సరైన సమయంలో అప్రమత్తంగా ఉండి చికిత్స తీసుకుంటే దీనిని నివారించొచ్చన్నారు. శారీరక శుభ్రతతో పాటూ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇలాంటి జాగ్రత్తలను పాటిస్తే ఈ కీటకం వల్ల కలిగే రుగ్మతల నుంచి బయట పొందొచ్చన్నారు. పొలాలకు వెళ్లే వారు పొడుగు ఫ్యాంట్లు, బూట్లు ధరించాలన్నారు.

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ సేవా శిబిరం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ప్రత్యేక సేవా శిబిరం కొనసాగుతుంది. ఏడోరోజైన ఆదివారం పిడింగొయ్యి గ్రామ ఉన్నత పాఠశాలలో వర్మీ కంపోస్టును వాలంటీర్లు ఏర్పాటు చేశారు. అనంతరం డిజిటల్ చెల్లింపులు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమాల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ హెచ్.శ్రీరామ్‌పవన్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

రైతులకు సన్మానం

ప్రజాశక్తి - చాగల్లు

మానవత ఆధ్వర్యంలో మానవత డైరెక్టర్లు సుంకవల్లి రమేష్ సహకారంతో ఆళ్ళ వీర వెంకట సత్యనారాయణ (పెద్దబాబు) పద్మ తులసి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా 20 మంది రైతులను సన్మానించారు. జాతీయ రైతు దినోత్సవాన్ని ముందుగానే చాగల్లు మండలం మార్కొండపాడు సొసైటీ రైతుల సమావేశ హాల్లో ఆదివారం నిర్వహించారు. చాగల్లు మండల ఆదర్శ రైతులను సుమారు 20 మందిని ఎంపిక చేసి వారిని సన్మానించారు, అనంతరం చాగల్లు-కొవ్వూరు మానవత తరుపున గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న కొవ్వూరు పట్టణానికి చెందిన నందివాడ గౌరి కుమార్తె విన్నీకి రు.5 వేల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత గ్రామ కన్వీనర్ ఆలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమర్ధవంతంగా గణాంకాల సేకరణ

ప్రజాశక్తితో ముఖ్య ప్రణాళికాధికారి పి.త్రినాథ

ముఖాముఖి



ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ఆయా శాఖల గణాంకాలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు తమ కార్యాలయం ప్రధానంగా విధులను నిర్వహిస్తోందని ముఖ్య ప్రణాళికా కార్యాలయ సంయుక్త సంచాలకులు పి.త్రినాథ తెలిపారు. ఏటా వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాలకు సంబంధించి ఆదాయ గణాంకాలను సేకరిస్తామని చెప్పారు.

స్వర్ణ ఆంధ్ర-2047 లక్ష్యం ఏమిటి

ప్రతి సంవత్సరం 15 శాతం కంటే ఎక్కువ వద్ధిని సాధించడం ద్వారా 2047 నాటికి రూ.2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలని లక్ష్యంగా పెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు స్వర్ణ ఆంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్‌ను ప్రారంభించారు. పది సూత్రాలతో 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను సంతోషకరమైన, ఆరోగ్యకరమైన, సంపన్న రాష్ట్రంగా మార్చడం ఈ విజన్ లక్ష్యం.

కాకినాడ జిల్లా విజన్ ప్లాన్ ఏమిటి

రాష్ట్ర లక్ష్యమైన 15 శాతం వద్ధి రేటుకు అనుగుణంగా, జిల్లా బలాలు, అవకాశాలు, అభివృద్ధి చెందుతున్న రంగాలు, వ్యూహాలను పరిగణనలోకి తీసుకుంటే, ప్రస్తుత జిడిపి రూ.61,336 కోట్ల నుంచి రూ.1.24 లక్షల కోట్లకు, ప్రస్తుత తలసరి ఆదాయం రూ.2,42,813 నుంచి రూ.4,84,907కు 2028-29 నాటికి పెరుగుతుందని అంచనా. స్వర్ణ ఆంధ్ర విజన్-2047 లక్ష్యాలను సాధించడానికి ముఖ్యమంత్రి పది సూత్రాలు మార్గదర్శక సూత్రాలను ప్రతిపాదించారు. ఇవి విజన్ యాక్షన్ ప్లాన్ అమలులో కీలక పాత్ర పోషిస్తాయి. విజన్ లక్ష్యాల్లో పురోగతిని ట్రాక్ చేయడం కోసం వివిధ శాఖలతో సమన్వయం చేసుకుని కెపిఐల ద్వారా పురోగతిని పర్యవేక్షిస్తాము.

జిల్లా సమీక్ష కమిటీ ఎలా జరుగుతుంది

జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని పరిశీలించడానికి జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు ప్రతి రెండు నెలలకోసారి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహిస్తారు. ఈ సమావేశాలకు మంత్రులు, ఎంపీలు, ఎంఎల్సిఇలు, ఎంఎల్ఎలు, డిసిసిబి, డిసిఎంఎస్ చైర్మన్‌తో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు హాజరవుతారు.

వ్యవసాయ గణాంకాలను ఎలా నిర్వహిస్తారు

వ్యవసాయ గణాంకాల సేకరణలో భాగంగా జిల్లాలో ఖరీఫ్, రబీ సీజన్లలో ఏయే పంటలు సాగవుతున్నాయి. ఎంత విస్తీర్ణంలో సాగవుతుంది. సాగు నీటి అవసరాలు ఏ మేరకు ఉన్నాయనే అంశాలను గణిస్తాం. పంటల విస్తీర్ణం నివేదికలను ఆహార, ఆహారేతర పంటలకు వ్యవసాయ గణన ద్వార ఖరీఫ్, రబీకి సంబంధించి రెండుసార్లు తయారు చేస్తాం.

పంటల దిగుబడి అంచనా ఎలా తయారు చేస్తారు

పంటల దిగుబడి అంచనాల వల్ల జిల్లాలో ఎంత పంట ఉత్పత్తి ఉన్నదో తెలుసుకొనవచ్చు. గత సంవత్సరంలో పంట విస్తీర్ణాన్ని బట్టి ఈ సంవత్సరంలో ఎన్ని పంటకోత ప్రయోగాలు చేయాలో నిర్ణయిస్తారు. ప్రతి మండలంలో నిర్ణీత కాల వ్యవసాయ గణన పథకం క్రింద ప్రస్తుత సంవత్సరంలో ఎంపిక చేసిన గ్రామాల్లో ఆహార, ఆహారేతర పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తాం. ఈ అంచనాల ఆధారంగా పంటల బీమా వంటి పథకాలను అమలు చేయడానికి వీలుంటుంది. ఒక గ్రామం యూనిట్‌గా తీసుకుని ఐదేళ్లలో పంటలను పోల్చి చూస్తాం. ఈ విధంగా అంచనాలను చూసిన అనంతరం పంటల బీమా పథకాలను అమలు చేస్తాము. దిగుబడి అంచనాలతో దేశ అవసరాలకు తిండి గింజలు ఎలా సరిపడతాయనే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకునే అవకాశం ఉంటుంది.

వర్షపాతాన్ని ఎలా గణిస్తారు

ప్రతి మండల కేంద్రంలో వర్షపాతాన్ని రోజూ ఉదయం 8:30 నిమిషాలకు డిప్యూటీ తహసీల్దార్ నమోదు చేస్తారు. ఆ వివరాలను మండల సహాయ గణాంక అధికారి సంబధిత ఆర్‌డిఒ, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారికి తెలియచేస్తారు. జిల్లాలో 21 మండలాల్లో వర్షపాతం సూచికలున్నాయి.

వాతావరణ పరిస్థితుల నివేదిక ఎలా తయారు చేస్తారు

మండల సహాయ గణాంక అధికారి ప్రతి బుధవారం మండలానికి సంబంధించి వర్షపాతం, పంటల వివరాలు, పంటల పరిస్థితి, నీటి లభ్యత, ప్రజారోగ్య పరిస్థితులు, పశువుల పరిస్థితి, పశుగ్రాస లభ్యత వివరాలు నివేదికను తమ కార్యాలయానికి పంపిస్తారు.

ధరల సేకరణ ఎలా చేస్తారు

మండల సహాయ గణాంకాధికారులు ఎంపిక చేసిన మండలాల్లో దినసరి, వారాంతపు, మాస నివేదికలను సేకరించి జిల్లా కార్యలయంకు అందిస్తారు. రాష్ట్ర స్థూల ఆదాయాన్ని నిర్ణయించడంలో ధరల సేకరణ ఒక ముఖ్యమైన సూచికగా ఉపయోగపడుతుంది.

పరిశ్రమల గణాంకాలు ఎలా

వార్షిక పరిశ్రమల సర్వే (ఎఎస్ఐ) పారిశ్రామిక రంగంలో గణాంకాల సేకరణకు ప్రతి సంవత్సరం నిర్వహించే పరిశ్రమల సర్వే ఒక ముఖ్యమైన వనరుగా ఉంది. 1948 చట్టం కింద గుర్తించిన పరిశ్రమలలో ఎంపిక చేసిన పరిశ్రమలకు సంబంధించి వార్షిక లెక్కల సర్వే చేస్తారు. రాష్ట్ర స్థూలాదాయాన్ని గణించడంలో వార్షిక పరిశ్రమల సర్వే వివరాలు ఉపయోగిస్తారు.

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

దేశానికి మార్గాన్ని నిర్దేశించిన వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని, విద్యార్థి దశ నుంచే ఆశయ సాధనకు కృషి చేసేలా ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలని సామాజికవేత్త చిర్రా గోపాల్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని మోర్తలో పూలే అంబేద్కర్ బహుజన ఫౌండేషన్ కార్యాలయంలో ఫౌండేషన్ అధ్యక్షులు వైవి.రావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ చేసిన సేవలను కొనియాడారు. విద్యార్థులకు పుస్తకాలు, పలకలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ లీగల్ అడ్వయిజర్ ఎం.సాంసన్, న్యాయవాదులు మురళి, అంబేద్కర్, భాగ్య రాజు, దళిత మహాసభ నాయకులు చాపల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో ఫౌండేషన్ అధ్యక్షులు వైవి.రావు తదితరులు

నేడు యథావిధిగా పిజిఆర్ఎస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వ్యాప్తంగా సోమవారం యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పిజిఆర్ఎస్)ను నిర్వహిస్తామని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల అర్జీలను స్వీకరించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. అర్జీదారులు ముందుగానే meekosam.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అర్జీల స్థితిని తెలుసుకో వడానికి 1100 నంబర్‌కు కాల్ చేయొచ్చన్నారు. డివిజన్, మండల స్థాయిల్లోనే అర్జీలు ఇవ్వాలన్నారు. వాటిపై జిల్లా స్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేస్తారని చెప్పారు. అధికారులు అందరూ వీడియో కాన్ఫరెన్స్‌కి తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. పౌర సేవల మెరుగుదలకు వాట్సాప్ నెంబర్ 9552300009 వినియోగంలో ఉందన్నారు.



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్

సిపి రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో కానూరు-ఉసులు మర్రు ఆర్ అండ్ బి సిసి రోడ్ల పనులను మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రూ.3 కోట్లతో ఈ రోడ్డును నిర్మిస్తున్నామన్నారు. సిసి రోడ్డు నాణ్యతలో రాజీ పడకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి వాహనదారులకు అందు బాటులోకి తీసుకురావాలని మంత్రి ఆదేశించారు. త్వరలో నియోజకవర్గంలోని ప్రధాన రోడ్లకు సరికొత్త రూపు రానుందన్నారు. ఎన్నో ఏళ్లుగా వాహనదారులు పడుతున్న కష్టాలకు చెక్ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజ్ఞాన, విహార యాత్ర

ప్రజాశక్తి - రామచంద్రపురం

స్థానిక మోడరన్ విద్యాసంస్థల విద్యార్థుల విజ్ఞాన, విహారయాత్ర ఆదివారం ఉత్సాహంగా జరిగింది. మారేడుమిల్లి అటవీ ప్రాంతాన్ని విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా మోడరన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లయన్ జివి.రావు మాట్లాడుతూ నిరంతరం ఉద్యోగ విధులతో గడిపే స్టాఫ్‌కి ఆటవిడుపుగా, ఉల్లాసంగా ఉండడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ ప్రిన్సిపల్ సిహెచ్.రాజేష్ మాట్లాడుతూ విహారయాత్ర వల్ల స్టాఫ్ అందరూ నూతన ఉత్తేజాన్ని పొందారన్నారు. మోడరన్ అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాంచౌదరి, ఇంటర్ మీడియట్ వైస్ ప్రిన్సిపల్ పిఎస్.ప్రకాష్, అకడమిక్ అడ్వైజర్ సిహెచ్.శ్రీనివాస్, మోడరన్ స్టాఫ్ పాల్గొన్నారు.



విజ్ఞాన యాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

సంఘానికి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - మామిడికుదురు

వికలాంగుల సంక్షేమ సంఘానికి స్థలం కేటాయించాలని పలువురు కోరారు. మండలంలోని పాసర్లపూడిలో మదర్ థెరిసా వికలాంగ సమాఖ్య సంక్షేమ సంఘం అధ్యక్షులు గుర్రం శీను అధ్యక్షతన ఆదివారం సమావేశం జరిగింది. సంక్షేమ సంఘం సేవా కార్యక్రమాలకు సహాయ సహకారాలు అంది స్తున్న దాత దంపతులను సత్కరించారు. వికలాంగుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న సంఘ నాయకులను అఖిల భారత దివ్యాంగుల సేవా సంస్థ రాఘవేంద్ర రావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, చుట్టగుల్ల కిషోర్, అఖిలభారత జెఎసి జాయింట్ సెక్రటరీ కొమ్ముల కోటేశ్వరరావు, కుడుపూడి సాయి, కేతాశ్రీను పాల్గొన్నారు.



దాతలను సత్కరిస్తున్న సంఘం ప్రతినిధులు

జగ్గన్నపేటలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి - మామిడికుదురు

మండలంలోని జగ్గనపేటలో డాక్టర్ కాశిన ప్రభాకర్ హాస్పిటల్ ఆవరణలో సత్యసాయి శత జయంతి సందర్భంగా ఆదివారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థిని, విద్యార్థులకు చిత్రలేఖనం, ముగ్గుల పోటీలు, పాటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. డాక్టర్ కాశిన ప్రభాకర్ ఆధ్వర్యంలో ప్రశాంతి పతాకాన్ని ఆవిష్కరించారు.

సిఐటియు మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - యానాం

సిఐటియు 18వ అఖిల భారత మహాసభల పోస్టర్‌ను స్థానిక టాక్సీ స్టాండ్ వద్ద ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ సిఐటియు అఖిలభారత మహాసభలు 2025 డిసెంబర్ 31 నుండి 2026 జనవరి 4 వరకు 5 రోజులు పాటు విశాఖపట్నంలో నిర్వహిస్తున్నారని తెలిపారు. మహాసభలను జయప్రదం చెయ్యాలని పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి 4 లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని, కొత్త చట్టాల వల్ల కార్మికులు శ్రమను కార్పొరేట్లకు ధారాదత్తం చేయడానికి ఉపయోగపడుతుంది తప్ప కార్మిక వర్గానికి ప్రయోజనం లేదని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలు కార్మిక, కర్షక, రైతు, ప్రజలపై పడుతున్న ప్రభావం విద్యార్థులు ఉద్యోగులు ప్రజాసమాస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ పోరాటాలకు నాంది పలుకుతారన్నారు. 5వ రోజు లక్షలాది మందితో బహిరంగ సభ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో యానాం సిఐటియు కన్వీనర్ కుంచే సత్యనారాయణ, కో కన్వీనర్ టి.శ్రీనివాసరావు, ప్రజా సంఘ నాయకులు ఎస్‌కె.బాబ్జి, రేవు విష్ణుమూర్తి, ఎలిపే వీరబాబు, కె.సురేంద్ర కుమార్, సత్తిబాబు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

పేదలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి - పి.గన్నవరం

ముంగండ మొదటి వార్డుకి చెందిన నడిమింటి శ్రీరామమూర్తి వార్డులోని పేదలకు ఆదివారం సర్పంచ్ కుసుమ చంద్రకళ చేతుల మీదుగా రగ్గులను పంపిణీ చేశారు. తన భార్య లక్ష్మీ పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు పుట్టిన రోజు శుభాకాంక్షలను తెలిపారు. ఈ కార్యక్రమంలో కుంచె సూర్యకళ, నడిమింటి సత్యనారాయణ మూర్తి, బి.సత్యనారాయణమూర్తి, ఉమ్మన్న, నాగబాబు, వెంకట్రావు, మాధ్వ, తదితరులు పాల్గొన్నారు.



రగ్గులు పంపిణీ చేస్తున్న సర్పంచ్ చంద్రకళ

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి

ప్రజాశక్తి- తాళ్లరేవు

ప్రాథమిక దశ నుంచే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలని లయన్స్ క్లబ్ ప్రతినిధి స్థానిక వైద్యులు విఆర్ఎన్‌బి.ప్రసాద్ అన్నారు. అలాంటి విద్య ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న ఉపాధ్యాయులు అభినందనీయమన్నారు. పోలేకుర్రు ప్రాథమిక పాఠశాలలో పాఠశాల అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వెంట్రు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఉత్తమ ప్రతిభ సాధించిన విద్యార్థులకు ప్రసాద్ సమకూర్చిన బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిమ్మకాయల సత్యనారాయణమూర్తి, హెచ్‌ఎం పెంకే అమ్మాజీ, ఉపాధ్యాయులు కాశి రవీంద్ర, గుత్తుల వెంకటేశ్వరి, టిఆర్.స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ రోడ్డులో వాహనాల మళ్లింపు

ప్రజాశక్తి- తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెం నుంచి ద్రాక్షారామం వెళ్లే రహదారికి పలుచోట్ల రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల వాహనాలను మళ్లించినట్టు కోరంగి ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. తాళ్లరేవు మండలంలోని సుంకరపాలెం, కాజులూరు మండలంలోని కాజులూరు, కోలంక పరిధిలో మెయిన్ రోడ్డుపై సిసి రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 9వ తేదీ నుంచి ద్రాక్షారామం వెళ్ళవలసిన ఆటోలు, బస్సులు, లారీలు, ఇతర భారీ వాహనాలు యానాం, కోటిపల్లి ఏటిగట్టు మీదుగా వెళ్లాలని తెలిపారు.

లిబరేషన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా బంగార్రాజు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ఈ నెల 6, 7 తేదీల్లో కడప జిల్లాలో జరిగిన సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర సమావేశాల్లో బుగత బంగార్రాజును తిరిగి కార్యదర్శిగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జున్ రావు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచీ హాజరైన కార్యకర్తలు 39 మంది రాష్ట్ర కమిటీ సభ్యులను ఎన్నుకున్నారన్నారు. ఈ సమావేశాలకు జాతీయ కార్యదర్శి దీపాకర్ బట్టచార్య, పోలిట్ బ్యూరో సభ్యులు స్వదేశ్ బట్టాచార్య, శంకర్ పరిశీలకులుగా చంద్రమోహన్ హాజరయ్యారన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యునిగా మానుకొండ లచ్చుబాబు కుడా నియమితులయ్యారని తెలిపారు. బంగార్రాజు ఎన్నికపై ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బుగత శివ హర్షం వ్యక్తం చేశారు.

పిఠాపురం రాజా ఆస్తులను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-కాకినాడ

పిఠాపురం మహారాజా ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందని ఎంఎల్ఎ వనమాడి కొండబాబు అన్నారు. ఆదివారం ఆనంద నిలయంకు చెందిన 19 ఎకరాల ఆక్రమణపై విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.వెయ్యి కోట్ల ఆస్తిని ఆక్రమించేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని, వారి ఆటలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. సమస్యను అధిష్టానం దృష్టికి తీసుకు వెళ్తామని చెప్పారు. ఇప్పటికే 1000 గజాల స్థలాన్ని ఆక్రమిస్తే, దానిని బాధితులకు అందించామని తెలిపారు.



లీగ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ముఖ్య అతిథులు

ఛాంపియన్స్ లీగ్-2025 ప్రారంభం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వీర్రాజు హైస్కూల్లో ఆదివారం పెద్దాపురం క్రికెట్ ఛాంపియన్స్ లీగ్-2025 పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల ప్రారంభ సభలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కొరుపూరి రాజు, మహారాణి సత్రం మాజీ చైర్మన్ తూతిక రాజు, జిగిని రాజేష్ కన్నా, స్కూల్ హెచ్‌ఎం కెవి.లక్ష్మీనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు సాయి నాగేంద్ర సాయి, భీమ సాయి మాట్లాడుతూ 16 రోజులపాటు ఈ టోర్నీ లీగ్ పద్ధతిలో జరుగుతుందన్నారు. పది టీములు పోటీ పడుతున్నాయన్నారు. మొదటి బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు, తృతీయ బహుమతి రూ.10 వేల బహుమతులు ఇస్తామన్నారు.

కంటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి

ప్రజాశక్తి - సామర్లకోట

కంటి పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జాగ్రత్తలు పాటించాలని డిసిసిబి చైర్మన్, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి, టిడిపి యువ నాయకుడు నిమ్మకాయల రంగనాగ్ పిలుపునిచ్చారు. హుస్సేన్‌పురం పంచాయతీ కార్యాలయంలో ఆదివారం శ్రీ కిరణ్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని తుమ్మల బాబు, రంగనాగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి మనుగడకు కళ్లు అత్యంత ప్రధానమని, అందువల్ల ప్రతి ఒక్కరూ కంటి సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చి జాగ్రత్త వహించాలని సూచించారు. శిబిరంలో కిరణ్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 30 మందిని ఉచిత ఆపరేషన్‌లకు ఎంపిక చేశారు. కొంతమందికి ఉచితంగా కళ్ళజోళ్లు అందించారు. ఈ కార్యక్రమంలో చల్లా బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎఎస్ఒలను మండల స్టాటిస్టికల్ అధికారులుగా గుర్తించాలి

ప్రజాశక్తి -గోపాలపురం

ఎఎస్ఒలను మండల స్టాటిస్టికల్ అధికారులుగా గుర్తించాలని, ఉప గణాంక అధికారులకు గెజిటెడ్ హోదా కల్పించాలని అపేస్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గోపాలపురం ఎఎస్ఒ జోడాల వెంకట్ కోరారు. ఆదివారం వెలగపూడిలో అపెస్సా రాష్ట్ర కార్యవర్గ మొదటి సాధారణ సమావేశం అధ్యక్షుడు బొడ్డేపల్లి మనోహర్ ఆధ్వర్యంలో జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అపేస్సా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జోడాల వెంకట్ మాట్లాడారు. ఎఎస్ఒ, డివైఎస్ఒల సమస్యల పరిష్కారం కోసం నిత్యం కృషి చేస్తున్నామన్నారు. అధ్యక్షులు మనోహర్ మాట్లాడుతూ అందరి సహకారంతో సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తున్నామన్నారు. సమస్యలను డైరెక్టర్ గోపాల్‌కు విన్నవించామని, దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, నాయకులు హాజరయ్యారన్నారు.